మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కల్వ సుజాత


చీరలను పంపిణీ చేస్తున్న సుజాత

కాచిగూడ: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణించాలని తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత అన్నారు. విబిజి ఫౌండేషన్ వనితా విభాగ్ ఫౌండర్ మడిప డిగె సత్యవతి ప్రసన్న జన్మదినం సందర్భంగా శుక్రవారం మహిళలకు చీరలు, కుట్టు మిషన్‌ల పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనాథ అశ్రమాల్లో నిత్యావసర వస్తువులు, వృద్ధాశ్రమాల్లో దుస్తులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ... మహిళలు ఏదో ఒక రంగంలో నైపుణ్యం పెంపొందించుకుని ఆర్థిక పురోగతిని సాధించాలన్నారు. మహిళలు ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం బాగుటుందని అన్నారు. ప్రతి మహిళ విద్యను అభ్యసించాలని సూచించారు. సత్యవతి ప్రసన్నను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాల్లో ముందుకు రావాలని కోరారు. శత చిత్రాల నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రొడ్యూసర్ డి.ఎస్.రావు, విబిజి ఫౌండేషన్ ఫౌండర్ మడిపడిగ రాజు, మీరా విజయలక్ష్మి, సంతోష్, విశ్వేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

డిప్యూటీ లేబర్ కమిషనర్ రాజేంద్రప్రసాద్


మాట్లాడుతున్న ఎస్ఆర్‌డీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాలల హక్కుల పరిరక్షణ కోసం తమవంతుగా కృషి చేస్తామని డిప్యూటీ లేబర్ కమిషనర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెయిన్‌బో హోమ్స్ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.... వీధి బాలలను గుర్తించి వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న అనాథ బాలలను చేరదీస్తున్న రెయిన్ బో లాంటి స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమన్నారు. ఎస్ఆర్‌డీ ఎన్‌జీవో సంస్థ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... నగరంలో ఎందరో అనాథ బాలలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నారన్నారు. వారి సమగ్ర సంరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి పిల్లల రక్షణ కోసం రెయిన్‌బో సంస్థ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జి.శైలజ, రెయిన్ బో సంస్థ ప్రతినిధి అంబిక, శ్రీలత, మైథిలి, నాగరాజు, నవీన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'సెవెన్ స్క్రీన్ థియేటర్లకు అనుమతులివ్వొద్దు'


శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ నేత

ముషీరాబాద్: ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేయనున్న సెవెన్ స్క్రీన్ థియేటర్‌లకు అనుమతులు ఇవ్వరాదని బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నేత ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం ఆర్టీసీ క్రాస్ రోడ్ చుట్టూ ఉన్న సినిమా థియేటర్‌లు, వాణిజ్య సంస్థలు, పారిశ్రామికవాడలతో వచ్చిపోయే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నదన్నారు. కొత్తగా భారీ షాపింగ్ కంప్లెక్స్‌లలో సినిమా థియేటర్స్ ప్రారంభిస్తే ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం స్టీల్ బ్రిడ్జి నిర్మించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపిందని, కొత్తగా పదుల సంఖ్యలో థియేటర్స్‌కు అనుమతులు ఇస్తే మళ్లీ ట్రాఫిక్ సమస్య మొదలవుతుందన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లలోని పాత సుదర్శన్ థియేటర్, ఓడియన్ థియేటర్‌ల స్థానంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఏర్పాటు చేయబోతున్న ఏడు స్క్రీన్‌ల, మరో భవనంలో ఏర్పాటు చేయబోతున్న థియేటర్‌లకు అనుమతులు ఇవ్వకూడదని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే ఇచ్చిన ఉన్న థియేటర్ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదకర పరిస్థితుల్లో జర్నలిస్టుల జీవితాలు


రాజేష్ కుటుంబ సభ్యులకు రూ. లక్ష సాయాన్ని అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

హిమాయత్‌నగర్: వృత్తిలో సవాళ్లు, విపరీతమైన పని ఒత్తిడి, సమయ పరిమితులతో జర్నలిస్టుల జీవితాలు ఆందోళనకరరంగా మారాయని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యువ ఫొటో జర్నలిస్టు నర్రె రాజేష్ 41 సంవత్సరాల చిన్న వయస్సులో మన మధ్య నుంచి అతని ఆకస్మిక మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఇటీవలే గుండెపోటుతో మరణించిన యువ ఫొటోజర్నలిస్టు నర్రె రాజేష్ సంస్మరణ సభ నిర్వహించింది. ఈ సభకు తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమళ్ల గంగాధర్ అధ్యక్షత వహించగా కె.శ్రీనివాస్‌రెడ్డితోపాటు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీ, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ప్రధాన కార్యదర్శి శిగా శంకర్ గౌడ్, నర్రె రాజేష్ సతీమణి లావణ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం తరపున నర్రె రాజేష్ కుటుంబానికి రూ. లక్ష నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఫొటో, వీడియో జర్నలిస్టులు ఆందోళనలు, హింసాత్మక సంఘటనలు చిత్రించే సమయంలో మరణించడం, గాయాలవడం తోపాటు పని ఒత్తిడితో ఫొటో జర్నలిస్టుల ఆరోగ్యాలు క్షణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నర్రె రాజేష్ భార్యకు పెన్షన్‌తోపాటు అయన పిల్లలకు విద్యను అందించడానికి మీడియా అకాడమీ సహాయం అందజేస్తుందని శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, జేఎన్‌జేహెచ్ఎస్ అధ్యక్షుడు బొమ్మగాని కిరణ్‌కుమార్, ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

భారీగా తాగునీరు వృథా

సెలయేటిని తలపించిన గోల్నాక మార్కెట్ రోడ్డు



గోల్నాక మార్కెట్ రోడ్డులో పైపులోంచి పైకి ఉబికి వస్తున్న నీరు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ గోల్నాక కూరగాయ మార్కెట్ రోడ్డులోని కమాన్ వద్ద శుక్రవారం ఉదయం సీవరేజీ పైపుల్లో లీకేజీలు ఏర్పడ్డాయి. పైపుల్లోంచి నీరు పైకి ఎగిసి వచ్చింది. వేలాది లీటర్ల తాగు నీరు మార్కెట్ రోడ్డును ముంచెత్తింది. దాదాపు రెండు గంటలకు పైగా తాగు నీరు రోడ్డుపై పొంగిపొర్లినా జలమండలి అధికారులు, సిబ్బంది అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సెలయేరులా పొంగిపొర్లుతున్న ఆ నీటిలో స్థానికంగా ఉన్న చిన్నారులు కేరింతలు కొడుతూ జలకాలాడుతూ ఆడుకోవడం కనిపించింది. చాలా సేపటి తరువాత అక్కడికి చేరుకున్న జలమండలి సిబ్బంది నీటి సరఫరా నిలిపివేశారు. అప్పటికే ఎంతో అమూల్యమైన వేలాది లీటర్ల తాగు నీరు వీధిపాలైపోయిందని స్థానికులు వాపోయారు. ఆ తర్వాత జలమండలి అధికారులు నిదానంగా పైపుల్లో ఏర్పడిన లీకేజీకి మరమ్మతులు ప్రారంభించారని తెలిపారు. తరుచూ ఈ ప్రాంతంలో పైపుల్లో లీకేజీలు ఏర్పడుతుందని, ఈ సమస్య పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి

- కష్టపడి పనిచేసే వారికి టీఆర్ఎస్‌లో దక్కని ప్రాధాన్యం
- లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించండి
- మతతత్వ పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండండి
- సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్


మాట్లాడుతున్న సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్

అంబర్‌పేట: కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను ఆదరించే పార్టీ అని... పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం అభ్యర్థి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. దేశంలో మతం పేరిట రాజకీయాలు చేసే పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. టీఆర్ఎస్ పార్టీలో అన్ని స్థాయిల నాయకుడికి, కార్యకర్తకు పదేళ్లలో స్వేచ్ఛ, సముచిత స్థానం దక్కలేదని దానం నాగేందర్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది.
◆ ముఖ్య అతిథిగా హాజరైన దానం నాగేందర్ మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని గుర్తుచేశారు. పార్లమెంటు ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ఢిల్లీలో ప్రశ్నించే గొంతుకలమవుతామని దానం స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సికింద్రాబాద్ ప్రజలు గెలిపిస్తే ఆయన పార్లమెంటు నియోజకవర్గానికి చేసిన మేలు ఎంటో ప్రజలకు ఇప్పటికైనా వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంటులో ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా మాట్లాడితే కిషన్‌రెడ్డి చప్పట్లు కొట్టారే తప్ప ప్రజా సమస్యలను పార్లమెంటు దృష్టికి తీసుకురాలేదని నాగేందర్ ఆరోపించారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ... అవినీతికి పాల్పడ్డ టీఆర్ఎస్ నేతలు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లు అప్రజాస్వామ్య పద్ధతులను అవలంభించారని వారికి వారు తగిన మూల్యం చెల్లిస్తారని జోస్యం చెప్పారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, అంబర్‌పేట కోఆర్డినేటర్ వరలక్ష్మి, ఖైరతాబాద్ జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషా శ్రీకాంత్‌గౌడ్, పార్టీ జీహెచ్ఎంసీ యూత్ విభాగం నేత మోతే రోహిత్, సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్‌గౌడ్, లక్ష్మణ్‌యాదవ్, దిడ్డి రాంబబు, గరిగంటి రమేశ్, లక్‌పతి యాదగిరి గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, పులి జగన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాదరణ: దానం


కాలేరు శ్రీనివాస్ రావుకు కాంగ్రెస్ కండువా కప్పుతున్న దానం

కాచిగూడ: వంద రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆదరాభిమానాలను చూరగొందని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. కాచిగూడ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాలేరు శ్రీనివాస్ రావు, ఎడ్ల నరేందర్ రెడ్డి తమ అనుచరులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాలేరు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. సూపర్‌స్టార్ కృష్ణతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరాని, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరానని, ఇప్పుడు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో తమ సొంత ఇంటికి వచ్చినట్లు అయిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, గరిగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి

చిక్కడపల్లి: కలుషిత నీటి సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. చిక్కడపల్లి 1, 2 వీధులతో పాటు బాపునగర్ పరిసర ప్రాంతాలలో ఇటీవల తాగునీటి పైపుల్లో రంగుమారిన, దుర్వాసనతో కూడిన కలుషిత నీటి సరఫరా జరుగుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయా ప్రాంతాలలో కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వేసవి దృష్ట్యా తాగునీటి ఇక్కట్లను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లో ప్రెషర్, కలుషిత నీటి సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో నేతలు వినయ్‌కుమార్, శ్రీకాంత్, లక్ష్మణ్‌గౌడ్, రంగనాథ్, వసంత్ పాల్గొన్నారు.

రమణకు సాహితీ పురస్కారం



చిక్కడపల్లి: గానసభ పూర్వ అధ్యక్షుడు కళా వెంకట దీక్షితులు జయంతిని కళాసుబ్బారావు కళావేదికలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ప్రముఖ సాహితీవేత్త రమణ వెలమకనికి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు పండిట్ అంజిబాబు, శంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలికతో ప్రేమ వివాహం.. యువకుడిపై పోక్సో కేసు

కాచిగూడ: బాలికను ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ యువకుడిపై కాచిగూడ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హబీబ్‌నగర్‌కు చెందిన బాలాజీ వృత్తిరీత్యా కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాచిగూడ పీఎస్ పరిధిలోని ఓ బస్తీకి చెందిన మైనర్ బాలికను బాలాజీ ఆరు నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. దీనిపై సదరు బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలాజీపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

సంప్రదాయ నృత్యంలో సత్తాచాటిన తన్మయి

బంజారాహిల్స్: ఉస్మానియా యూనివర్శిటీలో ఈ నెల మొదటి వారంలో జరిగిన ఓయూ ఇంటర్ కాలేజీయేట్ కల్చరల్ కాంపిటీషన్‌లో సైఫాబాద్ సైన్స్ కాలేజీ విద్యార్థిని సంప్రదాయ నృత్యంలో మొదటి బహుమతి గెలుచుకుంది. అన్ని కళాశాలల నుంచి విద్యార్థులు పోటీపడగా సైఫాబాద్ సైన్స్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తన్మయి క్లాసికల్ డ్యాన్స్‌లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.

కూలిన చెట్టు కొమ్మ: తప్పిన పెను ప్రమాదం



నల్లకుంట: నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ మెయిన్ రోడ్డులోని కిషన్ రావు ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఓ భారీ వృక్షం కొమ్మ శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలిపోయింది. అది కాస్తా రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో ఎంతో రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలతో తీవ్ర అంతరాయం కల్గింది. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ ఎన్‌డీఆర్ఎఫ్ బృందం హుటాహుటిన అక్కడికి చేరుకుని కూలి పడిన చెట్టు కొమ్మలను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. సుమారు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ అమృత అక్కడికి చేరుకుని చెట్ల కొమ్మల తొలగింపు పనులను పర్యవేక్షించారు.

అలరించిన సినీ సంగీత విభావరి


శివ పార్వతిని సన్మానిస్తున్న దృశ్యం


చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ శ్యామ గాయిత్రి నిర్వహణలో శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళా వేదికపై నూతన గాయనీగాయకులతో పాటు వర్ధమాన గాయకులు శుక్రవారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ పారిశ్రామిక వేత్త చిల్లా రాజశేఖర్ రెడ్డి గాయనీగాయకులను సత్కరించారు. శ్యామ గాయిత్రి సంస్థ నిర్వాహకురాలు శివ పార్వతి శాస్త్రీయ సంగీత గురువు వైవిధ్యత కోసం సినీ గురువు వైవిధ్యత కోసం సినీ పాటల విభావరి ఏర్పాటు చేశారన్నారు. అధ్యక్షత వహించిన కళా పోషకుడు గుదిబండి వెంకటరెడ్డి మాట్లాడుతూ... శివ పార్వతి సంగీత సేవను ప్రశంసించారు. ప్రముఖ గాయకుడు త్రినాథరావు, నాదయోగ కల్చరల్ ఆర్గనైజేషన్ స్థాపకుడు గణపతి తదితరులు పాల్గొన్నారు.

'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'పై బాలికలకు అవగాహన


విద్యార్థులకు హైజిన్ కిట్స్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

బంజారాహిల్స్: పిల్లలకు చదువు ఎంత ముఖ్యమో, వ్యక్తిత్వ వికాసం కూడా అంతే ముఖ్యమని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ డిప్నో పద్మా కమలాకర్, మోటివేషనల్ స్పీకర్ అరుణ్ అన్నారు. హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు ఎపిక్ గ్లోబల్ సొల్యూషన్స్ కంపెనీ సహకారంతో ఎంవీఎఫ్ రెసిడెన్షియల్ క్యాంపు విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా కౌమార దశకు రాకముందే విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన ఉండాలని వారు స్పష్టం చేశాన్నారు. మెంటల్ స్ట్రెస్‌తో పాటు హైజిన్, కెరీర్ గైడెన్స్, మెడిటేషన్ ఇలా పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 130 మంది విద్యార్థినులకు ఎపిక్ సంస్థ సాయంతో హైజిన్ కిట్స్‌ను అందజేశారు. ఎపిక్ కంపెనీ ఇండియా హెడ్ అభయ్ గార్గ్, సీఎఫ్‌వో విజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ యూనివర్సిటీలో తక్షణ ఉపాధి



ఉస్మానియా యూనివర్సిటీ: స్కిల్ యూనివర్సిటీల స్థాపనతో విద్యార్థులకు తక్షణం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అక్వాఫిన ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్, ఓయూ పూర్వవిద్యార్థి డాక్టర్ ఎన్‌వీ రావు పేర్కొన్నారు. శుక్రవారం ఖైరాతబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ బీబీఏ విద్యార్థులు ఫీల్డు విజిట్‌లో భాగంగా ఘట్‌కేశ్వర్ మండలం, కొర్రెముల గ్రామంలోని అక్వాఫిన ఇండస్ట్రీని సందర్శించారు. విద్యార్థులకు ఇండస్ట్రీ స్థాపన, నిర్వహణ, పెట్టుబడి, వస్తువు ఉత్పత్తి తయారీ, డిమాండ్, సప్లయ్, కార్మికుల పని తీరు తదితర అంశాలను వివరించారు. విద్యార్థులతో పాటు కాలేజీ బీబీఏ హెడ్ డాక్టర్ అంబాటి రమణ, అధ్యాపకులు శైలజ, కంప్యూటర్ సైన్స్ హెడ్ డా.శ్రీనివాస్ పాల్గొన్నారు.

17న సీతారాముల కల్యాణం

కాచిగూడ: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టు బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. సీనియర్ ట్రస్టీ పన్నాల విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగే ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పూజ అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

దేశాభివృద్ధి మోదీ సర్కార్ ఘనతే

కాచిగూడ: ప్రపంచంలో అగ్ర దేశాలతో పోటీపడుతున్న భారత దేశం.. ముమ్ముందూ ఇలాగే దూసుకెళ్లాలంటే మోదీ ప్రభుత్వం రావాలని బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం బర్కత్‌పురాలోని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెట్ కార్యాలయంలో గోల్నాక డివిజన్ పోలింగ్ బూత్ కోఆర్డినేటర్లు, బూత్ అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శుల సమావేశం రవీందర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ... దేశ అభివృద్ధితో పాటు ప్రజల అభ్యున్నతి, సంక్షేమానికి మోదీ ప్రభుత్వం ఆహర్నిశలు పాటుపడిందన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించే విధంగా పార్టీ నేతలు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. అంబర్‌పేట ప్రభావరి అంజన్ కుమార్ గౌడ్, ఎం.శ్యామ్‌రాజ్, కేసరి నర్సింగ్‌యాదవ్, ఆర్.వి.ఎల్.రమేష్, కె.రవీందర్, ఆర్.కె.రాంచందర్, ఎం.కృష్ణంరాజు, కె.శ్రీనివాస్ రెడ్డి, వై.దామోదర్, బి.రంజిత్‌రెడ్డి, స్వప్నప్రియ, సావిత్రి, సురేష్, అనిల్, రమేష్, వంశీకృష్ణ, వేణుగోపాల్, కృష్ణ, ఈశ్వర్‌రావు, జంగయ్య, కేశవ, సునిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా వేణుకుమార్


వేణుకుమార్‌కు నియామక పత్రాన్నిస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడిగా నారాయణగూడ ప్రాంతానికి చెందిన మెట్టు వేణుకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా వేణుకుమార్ మాట్లాడుతూ... బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో చేపట్టే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేసేలా చొరవ చూపుతామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, టి.నందగోపాల్, ఉదయ్ నేత తదతరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా పుట్ట పాండురంగయ్య


పాండురంగయ్యకు నియామక పత్రాన్నిస్తున్న గౌతంరావు

కాచగూడ: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శిగా డాక్టర్ పుట్ట పాండురంగయ్య నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపు పత్రాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు శుక్రవారం బర్కత్‌పురాలోని పార్టీ నగర కార్యాలయంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాండురంగయ్య మాట్లాడుతూ... పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పార్టీ అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ అడ్మిషన్లను అరికట్టాలి: ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్: ఇంటర్ బోర్డ్ గుర్తింపు లేకుండా, బోర్డ్ అధికారిక అడ్మిషన్ నోటిఫికేషన్ వెలువడకముందే అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న హిమాయత్‌నగర్‌లోని ఓ కళాశాలపై చర్యలు తీసుకోవాలని, గుర్తింపు లేని కళాశాలలకు వత్తాసు పలుకుతున్న ఇంటర్మీడియట్ విద్యాశాకాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సదరు కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, మురళి పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులను అలర్ట్ చేయాలి



బంజారాహిల్స్: ట్రాఫిక్ రద్దీగా ఉండే సమయాల్లో పోలీసులు అంతా విధుల్లో ఉండి పర్యవేక్షించాలని, తప్పనిసరిగా రోడ్లపై కనిపించాలని ఇన్‌చార్జి ట్రాఫిక్ అడిషనల్ పోలీస్ కమిషనర్, డీసీపీ ఎల్.సుబ్బారాయుడు సూచించారు. శుక్రవారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్కు చౌరస్తా, కేన్సర్ హాస్పిటల్ చౌరస్తా, జహీరానగర్ చౌరస్తా, బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 1/10, విరించి హాస్పటల్, అగ్రసేన్ ఐల్యాండ్, అపోలో, జర్నలిస్ట్ కాలనీ చౌరస్తాల్లో ఆయన వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి పర్యటించారు. ప్రధానంగా ట్రాఫిక్ ఫ్లో, ఫ్రీ లెఫ్ట్‌లు, యూటర్న్‌ల వద్ద పరిస్థితులను సమీక్షించారు. ముఖ్యంగా ట్రాఫిక్ సజావుగా సాగేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకోవడమే కాకుండా తగిన సూచనలు జారీ చేశారు. క్రేన్ వ్యవస్థను, పనిచేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో, రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సజావుగా సాగేందుకు కృషి చేయాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టంలో మాట్లాడాలని, వాహనదారులకు సూచనలు ఇవ్వాలని సూచించారు. ఫలానా వెహికల్ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన విషయాన్ని మైక్‌లో తెలపడం ద్వారా మిగతా వాహనదారులందరూ అలెర్ట్ అవుతారన్నారు. కొంతమంది ఫ్రీ లెఫ్ట్‌ను బ్లాక్ చేస్తుంటారని, వీరిపై దృష్టిపెట్టాలన్నారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు కలిగిన వాహనాలపై దృష్టిపెట్టాలన్నారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.